క్లుప్తంగా

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అశ్విని, బృందం

జగిత్యాల: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, పరీక్షలు చేస్తే కఠిన చర్యలుంటాయని మహిళ సాధికారత కో–ఆర్డినేటర్ అశ్విని అన్నారు. మంగళవారం వందరోజుల స్పెషల్ అవగాహన సదస్సులో భాగంగా అరుణ నర్సింగ్ హోమ్, కనెక్ట్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టబోయేది ఆడ/మగ అని అడగవద్దని, అది చట్టరీత్యా నేరమన్నారు. లింగ నిర్ధారణ చేసిన వారికి, చేయించుకున్న వారికి చట్టప్రకారం 3 ఏళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రముఖ పిడియాట్రిక్ ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి, స్త్రీ వైద్య నిపుణులు ఎల్లాల అరుణ, విజయరాంరెడ్డి, ఫణి భూషణ్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ గౌతమి, స్వప్న, హేమశ్రీ పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



ఇంటింటా సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పెగడపల్లి: వర్షాకాలం నేపథ్యంలో ప్రబలే వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వైద్య సిబ్బంది ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి జ్వరాల నియంత్రణకు తీసుకునే జాగ్రత్తలపై వివరిస్తూ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

ఇబ్రహీంపట్నం: హరితహారంలో భాగంగా గ్రామానికి 10 వేల మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించాలని తహసీల్దార్, గ్రామప్రత్యేకాధికారి ప్రసాద్ కోరారు. మంగళవారం ఎర్దండిలో గ్రామసభ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నీటి నిలువల గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంచేసి, దోమల నివారణకు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మనోజ్, కారోబార్ రత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో బయో మైనింగ్ పరిశీలన



బయో మైనింగ్ పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల: పట్టణ శివారులోని డంపింగ్ యార్డులో బయో మైనింగ్‌ను మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి మంగళవారం పరిశీలించారు. బయో మైనింగ్ జరుగుతున్న విధానాన్ని తెలుసుకుని పలు సూచనలు చేశారు. డంపింగ్ యార్డులో చెత్తను ప్రాసెసింగ్ చేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, మహేశ్, పాల్గొన్నారు.

మిషన్ భగీరథ లీకేజీ పరిశీలన

సాక్షి స్పందన

మేడిపల్లి: భీమారం మండలంలోని కమ్మరిపేటలో మిషన్ భగీరథ నీరు లీకేజీతో వృథా పోతోంది. దీనిపై సాక్షిలో కథనం రాయగా మంగళవారం ఎంపీడీవో పద్మజ సంఘటన స్థలాన్ని పరిశీలించి గ్రామ కార్యదర్శికి మెమో జారిచేసి జాప్యంపై వివరణ కోరారు. లీకేజీ రాకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రచారానికే పరిమితం.. ఆచరణ శూన్యం

- మున్సిపాలిటీలో కానరాని తడి,పొడి చెత్త వేరుచేసే ప్రక్రియ
- ఒకే వాహనంలో చెత్త తరలింపు
- నిరుపయోగంగా డీఆర్సీసీ కేంద్రం



నిరుపయోగంగా తడి, పొడి వనరుల కేంద్రం



తడిపొడి చెత్తను ఒకే వాహనంలో తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాయికల్: రాయికల్ మున్సిపాలిటీలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని ప్రతిరోజు మున్సిపల్ ట్రాక్టర్ల మైకుల్లో ప్రచారం చేయడమే తప్పా.. ఆచరణలో మాత్రం శూన్యంగా మిగిలింది. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసేందుకు ప్రచారం చేస్తున్న ట్రాక్టర్‌లో సైతం ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో రాయికల్ పట్టణ వాసులు వేస్తున్న చెత్తను ఒకటిగా సేకరిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే...

రాయికల్ పట్టణంలో 12 వార్డులుండగా 4500 గృహాలున్నాయి. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తసేకరణ కోసం ఉచితంగా రెండు రకాల బుట్టలను మున్సిపల్ అధికారులు పంపిణీ చేశారు. ఈ బుట్టల్లో ఇంట్లో ఉన్న వ్యర్థ పదార్థాలన్నీ, తడి, పొడిగా విభజించి చెత్త వేయాలని పట్టణ ప్రజలకు అవగాహన కల్పించినప్పటికీ చెత్త సేకరణలో మాత్రం మున్సిపల్ అధికారులు మాత్రం ఆచరించలేకపోతున్నారు.

నిరుపయోగంగా డీఆర్సీసీ కేంద్రం..

ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను వేరుచేసి తడి చెత్త నుంచి కంపోస్ట్ ఎరువు, పొడి చెత్త నుంచి వనరులను వేరు చేయడానికి డీఆర్సీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏడాది క్రితం నిర్మితమైనప్పటికీ తడి, పొడి చెత్తను వేరుగా సేకరించడం లేదు. తడి చెత్తతో తయారుచేసిన కంపోస్ట్ ఎరువు పొడి చెత్తను రీస్టైకింగ్ కోసం పంపించడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరనుంది. కంపోస్ట్ కేంద్రంలో ఒకదానిలో కొబ్బరి పీచు, పాతటైర్లు, మరొకదానిలో బీడీ పరిశ్రమ, పొడి వ్యర్థాలు, వస్త్ర ముక్కలున్నాయి. పొడి వనరుల కేంద్రంలో ఎలక్ట్రిక్ వ్యర్థాలు, ఇనుము, గాజు, ప్లాస్టిక్ వ్యర్థాల పేరుతో వేర్వేరు అరలు ఉన్నా అవి ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డీఆర్సీసీ కేంద్రంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అంతా ఒకేచోట వేస్తున్నారు



పట్టణంలో చెత్తను తడి, పొడిగా వేర్వేరుగా చేయకపోవడంతో అంత దుర్వాసన వస్తోంది. ఉన్న డీఆర్సీసీ కేంద్రం నిరుపయోగంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి తడి, పొడి చెత్త వేరుగా సేకరించేలా చూడాలి.

– కల్లెడ సునీత, కౌన్సిలర్

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తాం



రాయికల్‌లో సేకరించిన చెత్తను తడి,పొడిగా వేర్వేరు చేసేలా చర్యలు తీసుకుంటాం. ట్రాక్టర్‌లో ప్రత్యేకంగా తడి, పొడి చెత్త కోసం సేకరించేలా చర్యలు తీసుకుంటాం. వార్డుల వారిగా ఇన్‌చార్జీ లను నియమించి చర్యలు చేపడతాం.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

పడిపోతే ప్రమాదం..



మల్లాపూర్ శివారులో రహదారిపై ప్రమాకరంగా ఉన్న విద్యుత్‌స్తంభం

మల్లాపూర్: మండల కేంద్రం శివారులోని మెట్‌పల్లి రహదారిపై విద్యుత్‌స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఆ రహదారి వెంట ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. ఏ క్షణాన ఆ విద్యుత్ స్తంభం కింద పడుతుందోనని, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన పడుతున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదకర విద్యుత్‌స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ చిట్టిబాబు

ధర్మపురి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చిట్టిబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన చివరి మండల సర్వసభ్య సమావేశంలో ప్రశాంతంగా ముగిసింది. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. గత ఐదేళ్లపాలనలో సభ్యులు చేసిన అభివృద్ధి పనులతో పాటు ప్రజలతో ఉన్నటువంటి సత్సంబంధాలను నెమరేసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ .. మండల పరిషత్ అభివృద్ధిలో ఎంపీటీసీల పాత్ర ఎంతో కీలకమని ఐదేండ్ల పాలనలోఎంపీపీ, ఎంపీటీసీలకు ఎంతో గౌరవ స్థానాన్ని అందించిన ప్రజలకు ఎంతో రుణపడి ఉంటామని ఎంపీటీసీ స్థానం ఎంతో అనుభూతినిచ్చిందని తెలిపారు. అనంతరం మండల పరిషత్ పక్షాన ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణలతో పాటు మండల ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలోనే గ్రామాల అభివృద్ధి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

ఇబ్రహీంపట్నం: కేసీఆర్ ప్రభుత్వంలోనే పల్లెలు అనేక రంగాల్లో అభివృద్ధి చెందాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్‌లో రూ.7లక్షలతో నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటు ప్రజలకు సేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ కమటం భారతి, మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

మెట్‌పల్లిరూరల్: విద్యార్థులు సరైన ప్రణాళిక, శ్రద్ధతో చదవాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు.మెట్‌పల్లి మండలం వెల్లుల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రిజిస్టర్లను పరిశీలించి, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. తరగతుల నిర్వహణ, సౌకర్యాలతో పాటు తదితర విషయాల గురించి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు.బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మారు సాయిరెడ్డి,తదితరులు ఉన్నారు.

గ్రంథాలయం పరిశీలన

మెట్‌పల్లి: పట్టణంలోని గ్రంథాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని లైబ్రేరీయన్‌కు సూచించారు. అనంతరం జ్యోతి బాపూలే బాలుర, బాలికల గురుకుల పాఠశాలలను సందర్శించి భోజనం, క్లాసుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఆరోగ్య సమాజంతోనే దేశాభివృద్ధి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మల్లాపూర్: ఆరోగ్యకరమైన సమాజంతోనే దేశాభివృద్ధి చెందుతుందని లయన్స్‌క్లబ్ రిజీయన్ చైర్మన్ శివ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని వాసవీకన్యక పరమేశ్వరీ ఆలయం ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో 84 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 61 మందికి శస్త్ర చికిత్స కోసం కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోనల్ రీజియన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, మండల అధ్యక్షుడు కనుక సంజీవ్, రాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

మెట్‌పల్లి: పట్టణంలోని దుబ్బావాడకు చెందిన కుంబాల గణేశ్ భార్య సుమలతను కులం పేరుతో దూషించిన ఎండీ హకీం, నరేశ్, సద్దాం, మనోజ్, మారుతిలపై పోలీసులు అట్రాసిటీ కింద కేసు నమోదు చేశారు. దీనిపై మంగళవారం డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎస్సై చిరంజీవి ఉన్నారు.

రాజారం ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

ధర్మపురి: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మండలంలోని రాజారం ఎల్లమ్మ దర్శనానికి భక్తులు మంగళవారం భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి చల్లంగా చూడాలని కోరుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ చైర్మన్ బుర్ర భీమయ్య ఆధ్వర్యంలో వసతి కల్పించారు.

నిందితుని రిమాండ్‌కు తరలింపు

రాయికల్: పట్టణంలోని మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో పట్టణానికి చెందిన సింగు గంగనర్సయ్యను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్: పట్టణంలోని జీయర్‌స్వామి ట్రస్ట్ భవనంలో జీఎంఆర్ ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఉపాధి కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ కోర్సు, టైలరింగ్, ఎలక్ట్రిక్ హౌస్‌వైరింగ్ కోర్సులకు యువతీ యువకులకు మూడు నెలల పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాల కోసం 99633 47142 నంబరులో సంప్రదించాలని కోరారు.

పదెకరాల రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి



మాట్లాడుతున్న రైతు వెంకట్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: 10 ఎకరాలు ఉన్న రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని మండలంలోని అమ్మక్కపేట గ్రామానికి చెందిన రైతు ఎల్లాల వెంకట్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, అధికారులు సలహాలు, సూచనలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు వెంకట్‌రెడ్డికి మాట్లాడారు. వ్యవసాయం చేసే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని వరికి రూ. 500 బోనస్‌ను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు లావణ్య, ఏవోలు దీపిక, లావణ్య, యోగిత, నాగమణి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ

సారంగాపూర్: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలోఏవోలు తిరుపతినాయక్, అనూష, ఏఈవోలు వెంకటేష్, అంజనేయులు, సురేందర్, సందీప్, శిరీష, రైతులు పాల్గొన్నారు.

గొల్లపల్లి : మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం నిర్వహించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాల అమలు గురించి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతుల నుండి సలహాలు సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో ధర్మపురి ఏడీఏ రాంచందర్, ఏవోలు కరుణ, షాహిద్‌అలీ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ వైద్య శిబిరం

కోరుట్ల: అతి వేగంగా వ్యాపించే వ్యాధుల్లో టీబీ ఒకటని జిల్లా పీపీఎం కట్ట హరీశ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిని గుర్తించటం, చికిత్స తదితర అంశాలను అవగాహన కల్పించారు. ఆకలి లేకపోవటం, రెండు వారాలకు పైగా దగ్గు తగ్గక పోవటం, బరువు తగ్గటం వంటివి క్షయ వ్యాధి ముఖ్య లక్షణాలని పేర్కొన్నారు. క్రార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇమ్రాన్, మల్లికార్జున్, రియాజ్, ఆంజనేయులు, ఏఎన్‌ఎంలు సౌజన్య, రజిత పాల్గొన్నారు.

గోపాలమిత్ర భవనం వినియోగించాలి

కొండగట్టు: కొడిమ్యాల మండలం నల్లగొండలోని గోపాలమిత్ర భవనం 9 ఏళ్లుగా నిరుపయోగంగా ఉందని, వెంటనే వినియోగం లోకి తీసుకురావాలని మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు అక్కపల్లి రవీందర్ ఫిర్యాదు చేశారు. పశువులకు వ్యాధులు వస్తే చికిత్సకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి భవనాన్ని వాడకంలోకి తీసుకువచ్చి,వెటర్నరీ అసిస్టెంట్ ఉండేలా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గనవేని మల్లేశ్‌కు జాతీయ పురస్కారం

మల్లాపూర్: మండంలోని రేగుంటకు చెందిన సామాజిక సేవకుడు గనవేని మహానంది జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. సామాజిక సేవా రంగంతో పాటు యువత అభివృద్ధి కోసం మల్లేశ్ చేస్తున్న విశిష్టమైన సేవలను గుర్తించి జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలుగు వెలుగు సాహితి వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, జాతీయ ప్రాన కార్యదర్శి వలబోజు మోహన్‌రావు తెలిపారు. ఈ నెల 30న కరీంనగర్‌లో ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

అటవీశాఖ కార్యాలయం తనిఖీ

రాయికల్: పట్టణంలోని అటవీశాఖ కార్యాలయాన్ని మంగళవారం డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఫ్‌ఆర్వో భూమేశ్ ఉన్నారు.

రెండిళ్లలో చొరబడిన దుండగులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని మేడిపల్లిలో దుండగులు రెండిళ్లలో చొరబడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన జోరిగె శంకర్, జోరిగె అశోక్‌లు తమ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం షిరిడీ వెళ్లారు. మంగళవారం ఉదయం వారి ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా, ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

సీఐ, ఎస్సైలపై ఫిర్యాదు

మెట్‌పల్లి: మండలంలోని వెల్లుల్లకు చెందిన సుద్దాల స్వామిగౌడ్ అనే వ్యక్తి తప్పుడు పేరుతో పాస్‌పోర్టు పొందాడని తాను ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ నవీన్, ఎస్సై చిరంజీవిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పుల్లా రాజాగౌడ్ మంగళవారం తెలిపారు. స్వామిగౌడ్ తప్పుడు పేరుతో పాస్‌పోర్టు తీసుకున్నాడని తాను ఆధారాలతో సీఐ, ఎస్సైలకు మే 23న ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, అతని పాస్‌పోర్టును సీజ్ చేశామని తనకు బదులిచ్చారన్నారు. అనంతరం కొన్ని రోజులకు విచారణ జరిపి క్లీన్‌చీట్ ఇచ్చారని, దీంతో అతడు గల్ఫ్ దేశానికి వెళ్లిపోయాడని, దీనిపై విచారణ నిర్వహించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు.

న్యాయవాదులకు శిక్షణ

కోరుట్ల: భారత ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్రిమినల్ చట్టాలపై హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో మంగళవారం న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కోరుట్లకు చెందిన సీనియర్ న్యాయవాదులు హాజరయ్యారు. జులై 1 2024 నుంచి అమలులోకి వస్తున్న నూతన క్రిమినల్ చట్టాలు, భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత 2023, భారతీయ సాక్ష్య అధ్యయనం 2023 చట్టాలపై రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, తెలంగాణ బార్ కౌన్సిల్ సంయుక్తంగా ఈ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నాయని న్యాయవాదులు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కడకుంట్ల సదాశివ రాజు, గోనె సదానంద్ నేత, కటుకం రాజేంద్ర ప్రసాద్, ఆడెపు వినోద్ మద్దుల రోజా పాల్గొన్నారు.

బుగ్గారం వాసికి డాక్టరేట్

బుగ్గారం: మండల కేంద్రానికి ప్రముఖ కళాకారుడు,శ్రీగ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ నక్క రాజును గౌరవ డాక్టరేట్ వరించింది. విద్యా,ఆధ్యాత్మిక, కళా,సామాజిక సేవారంగాలలో ఆయన చేసిన కృషికి గానూ ఈ అవార్డుకు ఎంపికయ్యారు.ఈ మేరకు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సోమవారం అవార్డును ప్రకటించింది. జూలై 13వ తేదీన హైదరాబాద్‌లోని సరస్వతీ పరిషత్ ఆడిటోరియంలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రాజును పలువురు అభినందించారు.

ముగిసిన క్రీడాపాఠశాలల ఎంపిక పోటీలు

సారంగాపూర్: క్రీడా పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం జరుగుతున్న పాఠశాల స్థాయి క్రీడలు మంగళవారం బీర్‌పూర్ మండలంలో ముగిశాయి. బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడలను పాఠశాల హెచ్‌ఎం సంగెనభట్ల నర్సింహమూర్తి ప్రారంభించారు. ఈ క్రీడాల్లో బాలికలు 20 మంది, బాలుర విభాగంలో 30 విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 బాలికలను, 10 మంది బాలురను ఎంపిక చేసారు. వీరంత జిల్లాస్థాయిలో పాల్గొంటారు. కార్యక్రమంలో ఎంఈవో వాసం భీమయ్య, ఫిజికల్‌డైరెక్టర్ లక్ష్మణ్, పీఈటీలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మల్యాల: మండల పరిషత్ చివరి సర్వసభ్య సమావేశాన్ని ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి నేడు ఎంపిక పోటీలు

ధర్మపురి: క్రీడా పాఠశాలల్లో 2024–25 సంవత్సరానికి 4వ, తరగతి ప్రవేశానికి ఈనెల 26న ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని ఎంఈవో గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ధర్మపురి ప్రభుత్వ పాఠశాలలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాలకు పీడీ కవిత 8985653350 సంప్రదించాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యలయంలో రేపు(గురువారం) ఉదయం 11గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

రేపు ఎంపిక పోటీలు

కోరుట్ల: రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 27 వ తేదీన ఎంపిక పోటీలు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తామని ఎంఈవో గంగుల నరేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు అశోక్ 9948765002, కే. విజయ్ కుమార్ 99515 18737 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇసుక డంపుల బహిరంగ వేలం

వెల్గటూర్ : మండలంలోని స్తంభంపల్లి, పాశిగామ శివారులో సీజ్ చేసిన 869 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపులకు ఈ నెల 28వ తేదీన వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ శేఖర్ తెలిపారు. ఆసక్తి గలవారు 28న ఉదయం 10 గంటల వరకు స్తంభంపల్లి ఎల్లమ్మ ఆలయం వద్దకు వచ్చి డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తహసీల్దార్ పేర్కొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండిలో వడ్డెర కాలనీకి చెందిన 12 మంది విద్యార్థులకు ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన రైతు , సామాజిక సేవకుడు నాంపెల్లి రమేశ్ స్కూల్ బ్యాగ్స్‌లను, బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బట్టు శేఖర్, బొమ్మెన గణేశ్, పిట్టల వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా డిక్షనరీలు పంపిణీ

కథలాపూర్: మండలంలోని సిరికొండ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అదే పాఠశాల ఉపాధ్యాయుడు వనతడుపుల రవికుమార్ మంగళవారం డిక్షనరీలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లోకిని శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఇసుక డంపులు సీజ్

కథలాపూర్: మండలంలోని దుంపేట, దూలూర్, బొమ్మెన గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తహసీల్దార్ ముంతాజిబొద్దీన్ మంగళవారం తెలిపారు. మూడు గ్రామాల్లో సుమారు 40 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచారన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: పట్టణంలోని బైపాస్‌రోడ్ నుంచి గోవిందుపల్లి చౌరస్తా వరకు, కరీంనగర్ రోడ్ ఏరియా, జితేందర్ పెట్రోల్‌బంక్ ఏరియా, బాంబే షాపింగ్ మాల్ నుంచి గణేశ్ టెంపుల్ వరకు, నలంద డిగ్రీ కళాశాల ఏరియా, గోవిందుపల్లి ఏరియా, వెంకటాద్రినగర్, దేవుని గోవిందుపల్లి, బస్‌డిపో ఏరియా నుంచి జడ్జి బిల్డింగ్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అధికారి తెలిపారు.

వైభవంగా సంకష్ట వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని లక్ష్మీగణేశ్ మందిర్‌లో అంగారక సంకష్ట వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి హవనం, సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శంకరయ్య శర్మ, రిషిశర్మ, నిర్వాహకులు శ్రావణ్‌కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లిలో శ్రీ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి పాల్గొన్నారు. ఆమె వెంట నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.